క్లుప్తంగా

బాబూరెడ్డికి నివాళి



బెంగళూరులో బాబూరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే విశ్వనాథ్, వేణురెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ పెనుకొండ మాజీ సమన్వయకర్త చల్లాపల్లి బాబూరెడ్డి సమారాధన కార్యక్రమం బెంగళూరులోని ఆయన నివాసంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై బాబూరెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్, హిందూపురం వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, కుప్పం సమన్వయకర్త భరత్, సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ పంపిణీ



రైతులకు కేబుల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఏఈ సిద్ధేశ్వర కండక్టన్ కేబుల్ పంపిణీ చేశారు. రైతులు తమ పొలంలో కేబుల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఓటరు జాబితాపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటరు జాబితాపై గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలు ప్రతి బూత్‌లో ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, నగర పంచాయతీ కమిషనర్ సతీష్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు యోగా డే నిర్వహించాలి

హిందూపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో అంతర్జాతీయ యోగా దినోత్సం సందర్భంగా శనివారం ఉదయం 6గంటల నుంచి 8.30 గంటల్లోపు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ సరస్వతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు. అధికారులు, ఎన్‌జీఓలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తెల్లటి దుస్తులు ధరించి హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. యోగా కార్యక్రమం కార్యదర్శులు బాధ్యతగా ఏర్పాటు చేయాలన్నారు.

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉదయం 7 గంటలకు యోగా అభ్యాసన కార్యక్రమం జరగనుంది. మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రజలు హాజరు కావాలని తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి, ఎంఈఓ శ్రీధర్ తదితరులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీసీ డ్రైన్ ఆక్రమణ



నల్లబొమ్మనపల్లిలో సీసీ డ్రైన్ పూడ్చివేసి షెడ్డు కట్టుకున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు పంచాయతీ నల్లబొమ్మనపల్లిలో సీసీ డ్రైన్‌ను టీడీపీకి చెందిన ఓ మహిళ ఆక్రమణ చేసి పూడ్చివేసింది. అంతటితో ఆగకుండా అక్కడ ఓ షెడ్డు నిర్మాణం కూడా చేపట్టడంతో చుట్టుపక్కల ఇళ్ల గుండా మురుగు నీరు వెళుతోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి అధికమై రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ విషయంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

25న బహిరంగ వేలం

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసంలో పూజా సామగ్రి, టెంకాయలు విక్రయ హక్కు కోసం ఈనెల 25న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మురళీకృష్ణ గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలు డిపాజిట్‌గా చెల్లించాలన్నారు.

కూటమి నిర్లక్ష్యం.. కళాశాలకు శాపం



చిలమత్తూరులోని జూనియర్ కళాశాల

- అధ్యాపకులు ఇంటింటికీ తిరిగినా అడ్మిషన్లు శూన్యం
- జిల్లా టాప్ ర్యాంకర్ ఉన్న కళాశాలకు గడ్డుకాలం
- చిలమత్తూరు జూనియర్ కళాశాలలో 10 అడ్మిషన్లు

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వ కళాశాలలకు శాపంగా మారింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు కష్టంగా మారింది. అధ్యాపకులు ఇంటింటికీ తిరిగినా కళాశాలకు పట్టుమని పది అడ్మిషన్లు కూడా రాని పరిస్థితి. గతంలో ఎన్నడూ లేని విధంగా అడ్మిషన్ల కోసం అధ్యాపక బృందం తీవ్రంగా శ్రమిస్తోన్నా ప్రయోజనం లేకపోతోంది. జిల్లాలో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఉన్న కళాశాలకు గడ్డుకాలం ఎదురుకావడంపై లోపాలు ఏంటన్న విషయంపై దృష్టి సారించేందుకు జిల్లా విద్యాశాఖ ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన కళాశాల ప్రస్తుతం ఎదురీదుతోంది. సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నా అడ్మిషన్‌లు ఎందుకు కావడం లేదనే ప్రశ్న అందరిలోనూ ఉంది.

కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుండటంతో కళాశాలలకు శాపంగా పరిణమించింది. ఒక్క చిలమత్తూరు మండలం కాకుండా జిల్లా వ్యాప్తంగా కూడా ప్రభుత్వ కళాశాలల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. ఈ ఏడాది అడ్మిషన్లు జరగకపోతే వచ్చే ఏడాదికి కళాశాలలు మూతపడటం ఖాయంగా కనిపిస్తోంది. తద్వారా ప్రైవేటుకు లాభం చేకూర్చేలా ప్రభుత్వం యోచిస్తోందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. గత ఏడాది 300 పైచిలుకు అడ్మిషన్ ఉన్న కళాశాల ఒక్కసారి 50 శాతం లోపు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు నాడు– నేడు ద్వారా మంజూరు కాగా, కళాశాల సర్వాంగ సుందరంగా మారింది. ఇప్పుడు విద్యార్థులు లేక వెలవెలబోతోంది.

'నాడు-నేడు'తో అభివృద్ధి పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'నాడు – నేడు కింద కళాశాలకు రూ. 90 లక్షలు మంజూరు కాగా ప్రహరీ, మరుగుదొడ్లు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అంతే కాకుండా 150 డ్యుయల్ డెస్కులు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ 14 వచ్చాయి. ఈ ప్యానల్స్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు చెబుతున్నారు. కళాశాల భవనాలు కూడా బాగుండటంతో మంచి సౌకర్యాలు ఉన్న కళాశాలగా చిలమత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలిచింది. ఉచితంగా పాఠ్య పుస్తకాలు. మధ్యాహ్న భోజన సౌకర్యం, నోట్ బుక్స్, సైన్స్ విద్యార్థులకు రికార్డు పుస్తకాలు కూడా ఇస్తున్నారు. స్టాఫ్ కూడా తగినంత ఉన్నారు. గత ఏడాది 325 మంది విద్యార్థులతో కళాశాల కళకళలాడింది. అయితే ఈ ఏడాది అడ్మిషన్‌లకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి.

గత ఏడాది టాపర్లు ఇలా..

గత ఏడాది మండలంలోని తుమ్మలకుంటకు చెందిన బిందు ఎంపీసీ గ్రూపులో 980 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచింది. అలాగే శ్రావణి అనే విద్యార్థిని బైపీసీలో 957 మార్కులు, మమత హెఈసీలో 889 మార్కులు, అఖిల్ ఎ అండ్ టీలో 945, వీణ ఓఏ లో 889 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో శ్వేత బైపీసీలో 440 గానూ 422 మార్కులు, పల్లవి బైపీసీలో 416, సౌజన్య హెచ్‌ఈసీలో 427, ఏ అండ్ టీ లో భరత్ 489, ఓఏ లో జబీఉల్లా 436, లోకేంద్ర సెరికల్చర్‌లో 360 ఉత్తమ మార్కులు సాధించారు.

ఉత్తమ బోధన అందిస్తున్నాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన సౌకర్యాలతో పాటు ఉత్తమ విద్య అందిస్తున్నాం. గత ఏడాది తమ కళాశాల విద్యార్థి జిల్లా టాపర్‌గా నిలిచి, వీఐటీలో ఉచితంగా సీటు పొందింది. ఇది కళాశాలకు గర్వకారణం. ప్రస్తుతం అడ్మిషన్‌ల కోసం గ్రామాల్లో తిరుగుతున్నాం. 10 మంది కంటే తక్కువ అడ్మిషన్ జరిగాయి. పాంప్లెట్‌ల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం. కళాశాలలో చేరేందుకు ఇంకా అవకాశం ఉంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు ఒకేషనల్ కోర్సులు కూడా ఉన్నాయి.

– భీముడు నాయక్, ప్రిన్సిపాల్

నేడు సన్మాన కార్యక్రమం



టీఎన్ దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం లో రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయి పదవులు పొందిన వారికి శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమన్వయకర్త టీఎన్ దీపిక తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పదవులు పొందిన నేతలు అందరూ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలన్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌పీ రాష్ట్ర అధికార ప్రతినిధి అరె శ్యామల, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తునతరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా హనుమన్న



అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామ సమీపంలో ఉన్న మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా హనుమన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ ఓబుళపతి నల్లచెరువుకు బదిలీ అయ్యారు. కళ్యాణదుర్గం మోడల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హనుమన్న సాధారణ బదలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా హనుమన్న మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, సిబ్బందితో కలసి విద్యాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

పావగడ: పట్టణంలోని ఎంఏజీ సర్కిల్ వద్ద ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న ఓ షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ ఘటన బుధవారం రాత్రి అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక తుమకూరు రోడ్డులో అతి వేగంగా వస్తున్న సుజుకి బలెనో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న టైర్ల షెడ్డులోకి దూరింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నాగమోహన రెడ్డి, అతని స్నేహితుడు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వీరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తుమకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో యువకులకు గాయాలు

పావగడ: తాలూకాలోని ఇంటూరాయనహళ్లి గ్రామంలోని ఐరికాన్, కేవీస్సీ సోలార్ కంపెనీల్లో బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో విద్యుత్ పనులు చేస్తున్న ఎలక్ట్రిక్ విభాగానికి చెందిన ముగ్గురు యువకులు నాగేంద్ర, మహేశ్, చేతన్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రక్షించేందుకు ప్రయత్నించిన మహంతేశ్‌కు సైతం తీవ్ర గాయాలనాయి. తీవ్ర గాయాల పాలైన ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. సంఘటనపై తిరుమణి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పావగడ: పట్టణంలోని బళ్లారి రోడ్డు కర్ణాటక బ్యాంక్ ఏటీఎం సెంటర్ ఎదుట ప్రధాన రహదారిలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పట్టణానికి చెందిన ప్రసన్న కుమార్ లేఅవుట్‌లో నివసిస్తున్న ఖలీముల్లా (69) మృతి చెందాడు. ఖలీముల్లా స్కూటీలో వెళ్తుండగా.. కర్ణాటక బ్యాంక్ ఏటీఎం సెంటర్ ఎదుట ఆగిన ఓ కారు డోర్‌ను అకస్మాత్తుగా తెరవడంతో కింద పడ్డాడు. అదే సమయంలో వెనుక భాగం నుంచి వస్తున్న మరో కారు.. కింద పడిన ఖలీముల్లాను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బాధితుడి తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి



మాట్లాడుతున్న ఏటీఎల్ ఓబుళేష్

రొళ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి నిర్వహించారు. రొళ్ల ఉన్నత పాఠశాల ఆవరణ, ఆర్.వ్రహట్టి తదితర గ్రామాల్లో సీడీసీ మెంబర్లు, ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏటీఎల్ ఓబుళేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా ఆర్డీటీ సంస్థ ఎన్నో సేవ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యతో పాటు ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల భూములను చదును చేసే కార్యక్రమం, రైతుల భూముల్లో నీటి నిల్వ కోసం చెక్‌డ్యాంల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం ప్రోత్సహించడం, తక్కువ ధరకు డ్రిప్పు, స్ప్రింకర్లు పరికరాలను అందించే కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఆర్డీటీ మహిళ సంఘం సభ్యులకు రుణ సదుపాయం కూడా కల్పించి ఆర్థికంగా అండగా నిలిచినట్లు పేర్కొన్నారు.

ఆముదం విత్తనాల పంపిణీ

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో పలువురు రైతులకు ఐసీహెచ్–5 ఆముదం విత్తనాలను పంపిణీ చేశారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. విజయ్‌శంకర్‌బాబు మాట్లాడుతూ రైతులు వేరుశనగ పంట వేసి తరచూ నష్టపోతున్నారన్నారు. వేరుశనగకు బదులు ఆముదం పంట సాగు చేయాలని కోరారు. ఆముదం పంట సమగ్రయాజమాన్యాన్ని డా. నసిరుద్దీన్ రైతులకు తెలియజేశారు. మెట్ట ప్రాంతంలో ఈ పంట విశిష్టతను ఏడీఏ సత్యనారాయణ వివరించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సాంబశివ

పెనుకొండ: జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ కోరారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో గురువారం నాయకుడు బాబావలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సాంబశివ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేపట్టామన్నారు. కార్మికుల హక్కులను కేంద్రం కాలరాసిందని, కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికే లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఇవి అమలయితే కార్మికులకు కనీసం సంఘం పెట్టుకునే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరిగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. సమ్మెలో అన్ని రంగాల ఉద్యోగ, కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, నాయకులు నాగరాజు, బావమ్మ, రాజేశ్వరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు

పెనుకొండ: దేశంలో జరిగే ప్రజాస్వామికి ఉద్యమాలకు రాయలసీమ విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు ఇస్తుందని వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో గిరిజన ఇంటర్ విద్యార్థిని తన్మయ హత్య, సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలిక మీద అత్యాచారం, చిత్తూరు జిల్లా కుప్పంలో అప్పు కట్టలేదనే నెపంతో మహిళను చెట్టుకు కట్టివేసి ఇబ్బందులకు గురి చేయడం, అదే విధంగా కర్నూలు జిల్లా కొతాళం మండలం వల్లూరు గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచార సంఘటన, తిరుపతిలో బీటెక్ విద్యార్థినిని బంధించి మూత్రం తాగించడం లాంటి ఘటనలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అనంతపురం జిల్లాలో జరిగిన ఘటనలపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అనంతపురం వచ్చిన బాధితులకు ఎలాంటి భరోసా ఇవ్వకుండా పర్యటన కొనసాగించడం తగదని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం ఘటనలపై స్పందించిక పోవడం విచారకరమని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని పోరాడుతామని హెచ్చరించారు.

చెక్కభజనను వృత్తి కళగా గుర్తించాలి

తాడిమర్రి: చెక్కభజనను వృత్తి కళగా గుర్తించాలని కళాకారులు నిడిగల్లు సుదర్శనం, తురకవారిపల్లి రాజశేఖర్, ఆత్మకూరు కిష్టప్ప తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. తాడిమర్రిలో గురువారం వారు శ్రీకోదండరామ చెక్కభజన కళాకారుల అభివృద్ధి సంఘం 6వ వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న నార్పల మండల కేంద్రంలో జరగనున్న ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

శ్మశానానికి దారి చూపాలి



ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కమ్యూనిస్టు నాయకులు

పెనుకొండ రూరల్: చిలమత్తూరు మండలం సోమగట్ట గ్రామంలో శ్మశానానికి దారి చూపాలని కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు గ్రామానికి చెందిన దళితులతో కలిసి ఆర్డీఓ ఆనంద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానానికి ఏళ్ల తరబడి ఉన్నదారిని అడ్డగిస్తూ కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు శ్మశానానికి దారిని చూపించడంతోపాటు సీసీరోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు శేఖర్, సుగుణమ్మ, అంజనమ్మ, రియాజ్ పాల్గొన్నారు.

ర్యాలీలు ఊరేగింపులకు అనుమతి తప్పనిసరి

అమరాపురం: మండలంలో ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, తదితర వాటికి తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ ఇషాక్ బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక మీదట మండలంలో ఏవైనా సమావేశాలు, సభలు, ఊరేగింపులు, ర్యాలీలు తదితర పెద్ద పంక్షన్లు చేసుకునే వారు తప్పని సరిగా పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ శాఖ నుంచి అనుమతి పొందాలన్నారు.

వేరుశనగ సాగు ప్రశ్నార్థకం

- వర్షం కోసం రైతన్నల ఎదురు చూపు
- ఊపందుకోని వేరుశనగ సాగు
- ఇంత వరకూ కేవలం 918 ఎకరాల్లో సాగైన వేరుశనగ



వేరుశనగ సాగు కోసం దుక్కులు చేస్తున్న దృశ్యం



వేరుశనగ కాయల నుంచి విత్తనాలను వేరుచేసుకుంటున్న దృశ్యం

మడకశిర: నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు ప్రశ్నార్థకంగా మారింది. సాధారణ సాగు విస్తీర్ణంలో కూడా పంట సాగవుతుందో లేదో అనే అనుమానం కలుగుతోంది. ఏటా ఈ సమయానికి వేరుశనగ సాగు విస్తీర్ణం భారీగా ఉండేది. అయితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం నామమాత్రంగానే ఉంది. సాగు విస్తీర్ణం ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఉండే అవకాశం లేదని భావిస్తున్నారు. సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశం ఉంది. నియోజకవర్గంలో అమరాపురం, గుడిబండ, మడకశిర, రొళ్ల, అగళి మండలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 58 వేల ఎకరాల వరకు ఉంటుంది. మడకశిర మండలంలో 13 వేలు, అమరాపురం మండలంలో 14 వేలు, గుడిబండ మండలంలో 15 వేలు, రొళ్ల మండలంలో 9 వేలు, అగళి మండలంలో 7 వేల ఎకరాల చొప్పున సాధారణ సాగు విస్తీర్ణం ఉంటుంది. ప్రస్తుతం వేరుశనగ కేవలం 918 ఎకరాల్లో మాత్రమే సాగైంది. మడకశిర మండలంలో 43, అమరాపురం మండలంలో 200, గుడిబండ మండలంలో 450, రొళ్ల మండలంలో 75, అగళి మండలంలో 150 ఎకరాల్లో మాత్రమే వేరుశనగ సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 58 వేల ఎకరాల్లో పంట సాగు కావాల్సి ఉండగా.. కేవలం 918 ఎకరాల్లో సాగు కావడం గమనార్హం. ఇంకా 57,082 ఎకరాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా పంట సాగు కావాల్సి ఉంది.

కరుణించని వరుణుడు..

నియోజకవర్గంలో వేరుశనగ సాగు విస్తీర్ణం పెరగకపోవడానికి కారణం వర్షం రాకపోవడమేనని రైతులు అంటున్నారు. గత 10 రోజులుగా నియోజకవర్గంలో పదునైన వర్షం పడలేదు. తుంపర వర్షం పడటంతో వేరుశనగ విత్తుకు ఈ వర్షాలు అనుకూలించ లేదు. రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఆషాఢ మాసం దగ్గర పడుతోంది. గాలుల తీవ్రత మొదలైంది. ఫలితంగా అదునైన వర్షాలు పడుతాయో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూలై 15 వరకు అదును

వేరుశనగ సాగుకు సమయం పూర్తి కావస్తోంది. విత్తు పనులను రైతులు 25 రోజుల్లోగా పూర్తి చేసుకోవాల్సి ఉంది. జూలై 15 వరకు వేరుశనగ విత్తనం వేయడానికి మంచి అదునుగా వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. రైతులు ఆలోగా విత్తనం వేసుకుంటే మంచి దిగుబడి లభించే అవకాశం ఉంటుంది. గడువు మీరిన తర్వాత విత్తనం వేస్తే దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుంది. రైతులు వరుణుడి కటాక్షం కోసం ఎదురు చూస్తున్నారు. సకాలంలో వరుణుడు కరుణిస్తాడో లేదో వేచి చూడాల్సి ఉంది.

విత్తుపై ఆందోళన చెందుతున్నాం



వేరుశనగ విత్తుపై ఆందోళన చెందుతున్నాం. విత్తడానికి సిద్ధంగా ఉన్న సమయంలో వర్షం రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గడువులోగా విత్తనం వేస్తామా లేదా అనే భయం పట్టుకుంది. విత్తనం వేయడానికి 25 రోజుల గడువు మాత్రమే ఉంది. ఆలోగా పంట సాగు చేస్తేనే లాభదాయకంగా ఉంటుంది. లేకపోతే నష్టపోవాల్సి వస్తుంది.

– నాగరాజు, బీజీ హళ్లి, రొళ్ల మండలం

వర్షం వస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



వర్షం వస్తే వేరుశనగ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో విస్తీర్ణం పెరగలేదు. ఇందుకు కారణం వర్షం రాక పోవడమే. రైతులు జూలై 15 వరకు విత్తనం వేసుకోవడానికి మంచి అదును. వేరుశనగ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర